క్లుప్తంగా

పనుల పరిశీలన



ధన్వాడ: మండలంలోని చర్లపల్లి గ్రామంలో కొనసాగుతున్న మనఊరు, మనబడి, ఎన్ఆర్ జీఎస్ పనులను బుధవారం జిల్లా ఈఈ నరేందర్ పరిశీలించారు. మనఊరు మనబడి పనులలో కంట్రాక్టర్లకు పలు సూచనలు అందజేశారు. పనులను నాణ్యతతో చేయాలని గుత్తేదారులకు సూచించారు. నాణ్యత లోపిస్తే బిల్లులను నిలుపుదల చేస్తామన్నారు. ఇందులో సర్పంచ్ రాములు, ఏఈ ప్రవీణ్ ఉన్నారు.

మరేమ్మకు ప్రత్యేక పూజలు

మాగనూర్: పుంజనూర్ గ్రామంలో వెలసిన మారేమ్మవ్వ తల్లి జాతరను మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి బుధవారం అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను సన్మానించారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి

కృష్ణా: కర్ణాటకలోని బెంగుళూర్‌లో గడినాడ కన్నడ భాష అభివృద్ధికి గాను బుధవారం ప్రభుత్వం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఈ ప్రాంత సంఘం నాయకులు పాల్గొని ప్రత్యేక వినతిపత్రంను అందించారు. ఈ సందర్భంగా గడినాడ సంఘం అధ్యక్షుడు అమర్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని సరిహద్దులలో ఉన్న కన్నడ మాధ్యమ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తెలంగాణ ప్రాంతంలో కన్నడ భాష భవనంను నిర్మించాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కోరినట్లు వారు తెలిపారు. ఇందులో గడినాడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి

కృష్ణా: విద్యద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని శ్రీ క్షీరలింగేశ్వర మహాస్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ విద్యాసంస్థ భవన నిర్మాణానికి శంఖుస్థాపన నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజప్పగౌడ, సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు శివప్ప, కృష్ణా మాజీ సర్పంచ్ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

నారాయణపేట రూరల్ : ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1 న జిల్లా కలెక్టరేట్ ముందు చేపడుతున్న ధర్నాను విజయవంతం చేద్దామని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాంబశివుడు అన్నారు. స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో బుధవారం ధర్నా వాల్‌పోస్టర్ విడుదల చేసి మాట్లాడారు. సీఎం ప్రకటించిన విధంగా భవన నిర్మాణ కార్మికులకు ఉచితంగా మోటర్ సైకిళ్లు ఇవ్వాలని, ప్రమాద బీమా రూ.10లక్షలు చెల్లించాలని, 60ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి రూ6వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్పులు, పెండింగ్ క్లెయిమ్స్ చెల్లించాలన్నారు. ధర్నాకు పెద్ద సంఖ్యలో కార్మికులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, రామాంజనేయులు, చెన్నప్ప, కనకరాయుడు, సాయిలు పాల్గొన్నారు.

'రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే'



ఆత్మకూర్: మండలంలోని కత్తేపల్లికి చెందిన ప్రముఖ సామాజికవేత్త, రేయిన్‌బో హోటల్ అధినేత పి.విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం 500 మంది అనుచరులతో కలిసి హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. హాత్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయడంతో పాటు గడపగడపకు వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. నారాయణపేట, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల అధ్యక్షులు వాకిటి శ్రీహరి, జి.మధుసూధన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్, ఎన్ఆర్ఐ పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, అయ్యూబ్‌ఖాన్, తులసిరాజ్, పరమేశ్, శ్రీను, గణేష్, మహేందర్‌రెడ్డి, అరుణ్ పాల్గొన్నారు.

నేడు వాహన ర్యాలీ

నారాయణపేట రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలు అమలు చేయాలంటూ గురువారం నిర్వహించ తలపెట్టిన వాహన ర్యాలీని జయప్రదం చేయాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర నాయకులు యాదగిరి, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథ నాయకులు బి.రాము కోరారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఉపాధిహామీలో 200 దినాలు పని కల్పించి, రోజువారి కూలీ రూ. 600 వచ్చే విధంగా చూడాలన్నారు.

గట్టు తిమ్మప్ప బ్రహ్మోత్సవం

- నేటి నుంచి మాద్వార్‌లో ప్రారంభం
- 28న రథోత్సవం



అలయ ముఖద్వారం



గట్టుతిమ్మప్ప స్వామి



స్వామివారి రథాలు

మక్తల్: మక్తల్ నియోజకవర్గంలోని మాద్వార్ నల్ల కొండల్లో వెలసిన శ్రీ గట్టుతిమ్మప్పస్వామి(లక్ష్మీవెంకటేశ్వరస్వామి) వారి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి 30 వరకు జరుగుతాయని నిర్వాహకులు మార్కెట్ మాజీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు తెలిపారు. 26 గురువారం ఉదయం ఆయన ఇంటి నుంచి పల్లకీసేవతో స్వామివారిని కొండపైకి తీసుకెళ్తారని, స్వామి వారికి పవిత్రమైన కృష్ణానది నీటితో పుష్కరస్నానం చేయిస్తారని వివరించారు. 27న శుక్రవారం సాయంత్రం 6గంటలకు ప్రభోత్సవం, 28న రథసప్తమి రోజు శనివారం కల్యాణోత్సవం, సాయంత్రం 6గంటలకు స్వామివారి రథోత్సవం, 29న ఆదివారం పాల ఉట్ల కార్యక్రమం, 30న సోమవారం గరుడవాహనసేవ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. 5రోజులపాటు జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు శోలాపూర్, బొంబాయి, అంబర్‌నాథ్, హైదరాబాద్, గోవా,పూనే, బెంగుళూర్ తదితర పట్టణాలు, గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని వివరించారు. భక్తులకు మంచినీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాట్లతో పాటు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 28న రాత్రి 9 గంటలకు సంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తుల సహకారంతో ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమాల్లో మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పాల్గొంటారని వివరించారు.

ఆలయ ప్రాశస్త్యం..

మాద్వార్ గ్రామంలోని కొండపై కొలువుదీరిన శ్రీ గట్టుతిమ్మప్పస్వామి ఆలయాన్ని సుమారు 400 సంవత్సరాల క్రితం నిర్మించారు. పూర్వం ఈ కొండపై ప్రకృతి రమణీయమైన అందాలతో ప్రశాంత వాతావరణంలో శ్రీ స్వామివారు సంచరిస్తుండే వారని ప్రతీక. ప్రతిరోజు కొండపై పశువుల కాపరులతో స్వామి వారు ఆటలాడుతూ వారు తెచ్చిన సద్ది ముద్దలు తిని కాలక్షేపం చేసేవారు. ఒకరోజు స్వామివారు కొండపై ఒక గుండులో ప్రత్యక్షమై మహిమలను చూయించినట్లు కథనం. 'ఇంతకాలం మీతో ఆడుతూ, పాడుతూ గడిపినది నేనే' అని గట్టుతిమ్మప్ప స్వామి అని కాపరులకు తెలిపారని ఇక్కడి ప్రజలు చెబుతారు. అప్పటి నుంచి కలియుగ వైకుంఠం శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రతిరూపమైన శ్రీ గట్టుతిమ్మప్ప స్వామిని ఈ ప్రాంత ప్రజలు పూజిస్తూ తరిస్తున్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు



విద్యుత్ దీపాలంకరణలో జిల్లా కలెక్టరేట్ సముదాయం



ఎస్పీ కార్యాలయంలో..

నారాయణపేట: 73వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష దిశానిర్దేశంతో జిల్లా కలెక్టరేట్ ప్రాంగణాన్ని జిల్లా అధికార యంత్రాంగం ముస్తాబు చేసింది. జిల్లా అడిషనల్ కలెక్టర్ పద్మజా రాణి పర్యవేక్షణలో ఏఓ నర్సింగ్‌రావు, తహశీల్దార్ దానయ్యలు దగ్గరుండి కార్యక్రమ ఏర్పాట్లు చేయించారు. పోలీసు కవాతు నిర్వహించేందుకు సాయుధ బలగాలచే ప్రాక్టీస్‌ను నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, ఎస్పీ తదితర ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆ తర్వాత కలెక్టర్ గౌరవ వందన స్వీకార కార్యక్రమం జరుగుతుంది. 9.05 గంటలకు జిల్లా కలెక్టర్ సందేశం, 9.15 గంటలకు ప్రశంస పత్రాల అందజేత , 9.45 గంటలకు కార్యక్రమం ముగింపు ఉంటాయి.

మరికల్: మండల కేంద్రంలో గురువారం జరిగే గణతంత్ర వేడుకలకు అధికారులు ప్రభుత్వ కార్యాలయాలను బుధవారం ముస్తాబు చేశారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, సర్పంచులు ఒకరోజు ముందే సన్నద్ధమై విద్యుత్‌దీపాలతో కార్యాలయ భవనాలను అలంకరించారు.

మద్దూరు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు అందగా తీర్చిదిద్దారు. నందిపాడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పిరమిడ్ ఆకృతిలో వివిధ విన్యాసాలు చేయడానికి రిహాసల్స్ చేశారు. అలాగే వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు దేశ నాయకుల వేషధారణలో ర్యాలీలో పాల్గొనడానికి ఏర్పాటు చేసుకున్నారు.

ఘనంగా ఓటర్ల దినోత్సవం



మద్దూరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ రవి

జిల్లాలోని ఆయా మండల కేంద్రాలు, గ్రామాలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా మండలాలో తహసీల్దార్లు ప్రతిజ్ఞ చేయించారు. 18 సంవత్సరాలు నిండిన యువత విధిగా ఓటు హక్కును పొందాలని కోరారు. ఆయా పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎంలు ఓటు హక్కు ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



మరికల్‌లో..



మాగనూర్‌లో..



మీర్జాపూర్ పాఠశాలలో ..

క్యాలెండర్ ఆవిష్కరణ

నారాయణపేట రూరల్ : ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఐఈఆర్‌పీల నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం డీఈఓ లియాకత్‌అలీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని, అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం డీఈఓకు సన్మానం చేశారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, ఎఫ్ఏఓ మంజుల, ఆ సంఘం నాయకులు నిరంజన్, శ్రీనివాస్, తౌసిఫ్, నిరంజన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి

మరికల్: కంటి సమస్యలతో బాధపడుతున్న వారు కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని పరిష్కరించుకోవాలని సర్పంచ్ గోవర్ధన్ అన్నారు. నాలుగు రోజుల నుంచి కార్యక్రమం కొనసాగుతోందన్నారు. అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, తదితరులు

మాగనూర్: మహిళ సమైఖ్యలో ప్రధానమైన అంశాలపై ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని ఎంపీపీ శ్యామలమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే చిట్టెం రామోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమైఖ్య ఖర్చులలో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించడం మానుకోవాలని అన్నారు. సరైన సమాచారం ఇవ్వడం లేదని ఏపీఎం రాంలింగ్‌పై అసహనం వ్యక్తం చేశారు. మహిళా సమైఖ్య ప్రత్యేక రుణాలను వారికి అవసరమైన వారికి మాత్రమే రుణాలు కేటాయిస్తున్నారని ఎంపీపీ శ్యామలమ్మ, వైస్ఎంపీపీ తిప్పయ్య సభ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పూర్తివివరాలు వచ్చే సమావేశంలో ఉంచాలని అంతవరకు మహిళ సమైఖ్య ప్రగతిని పోస్టుపాండ్ చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతుబంధు అందజేత, సైట్ విషయంపై వైస్ ఎంపీపీ తిప్పయ్య , ఏఓహరితను ప్రశ్నించగా ప్రస్తుతం సైట్ బంద్ ఉందని తెలిపారు. నేరడగం పాఠశాల హెచ్ఎం రాజేందర్‌ను కలెక్టరెట్‌కు సరేండర్ చేయగా మళ్లీ పాఠశాలకు రావడంపై ఎంపీటీసీ ఎల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగించాలని ఎంఈఓ లక్ష్మినారాయణను కోరారు. మన ఊరు-మన బడి పనులలో జాప్యం వహిస్తున్నారని అన్నారు. తళంకేరి పాఠశాలకు ఉపాధ్యాయుల కొరతపై స్పందించాలని జెడ్పీటీసీ వెంకటయ్య కోరగా పరిష్కారిస్తామని ఎంఈఓ తెలిపారు. కొల్పూర్‌లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని జెడ్పీటీసీ తెలుపగా, పరిష్కారిస్తామని ఏఈ దేవేంద్రనాయుడు పేర్కొన్నారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఒక స్తంభం ఇవ్వడంపై ఎమ్మెల్యే ప్రశ్నించగా, ప్రస్తుతం అలానే ఉందని ఏఈ తెలిపారు. సంగంబండ లోలెవల్ కెనాల్‌కు చివరివరకు నీరు పోవడం లేదని పరిష్కరించాలన్నారు. అదేవిధంగా మొక్కల సంరక్షణలో అధికారులు బాధ్యతగా వ్యవహరించడం లేదని ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి డబ్బులు రావడం లేదని ఏపీఓ సత్యప్రకాష్‌ను ప్రశ్నించారు. రైతులకు టేకు మొక్కలు ఇచ్చారా అని ఎమ్మెల్యే ప్రశ్నించగా, స్వయంగా తెచ్చుకుంటే ఖర్చులు అందజేస్తామని ఏపీఓ తెలిపారు. డీసీసీబీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నిజాంపాషా, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ యాకుబ్‌అలీ, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నాటుకోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం

నర్వ: రైతులు వ్యవసాయం, పశుపోషణతో పాటు నాటుకోళ్లను పెంచుకుంటే అధిక ఆదాయం సాధించవచ్చని మండల పశువైద్యాధికారి డా.అశోక్ అన్నారు. బుధవారం నర్వ పశువైద్య కేంద్రంలో రైతులకు ఉచితంగా నాటుకోళ్లను అందించారు. గతంలో నాటుకోళ్ల యూనిట్‌ల కోసం రూ.600 డీడీ చెల్లించి వారికి 25 యూనిట్‌లను అందించారు. ఈ సందర్భంగా ఒక్కో యూనిట్‌లో 20 నాటుకోళ్లు ఉంటాయన్నారు. రైతులు తమ పొలాల వద్ద ఈ నాటుకోళ్లను పెంచుకుంటే అదనపు ఆదాయం వస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని నాటుకోళ్ల యూనిట్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు శేఖర్‌యాదవ్, వెంకటేశ్వర్‌రావు, శ్రీకాంత్ రెడ్డి తదితరులున్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ముగ్గుల పోటీలు



కోస్గి: మండల పరిధిలోని ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సైన్స్ ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. పాఠశాలలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు వినూత్నంగా సైన్స్ ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు గుండె, ఊపిరితిత్తులు పలు సైన్స్ సంబంధిత ముగ్గులు వేసి ప్రత్యేకతను చాటుకున్నారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం బాలకృష్ణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఘనంగా శివపూజ

నారాయణపేట రూరల్ : పట్టణంలోని ప్రకాష్ స్వగృహంలో బుధవారం శివ పూజా కార్యక్రమం నిర్వహించారు. శివమాలాధారుల ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహానికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, పూష్పాలంకరణ, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. శరణ ఘోష, భక్తిపాటలు, భజనలు చేశారు. గురుస్వాములు, వివిధ పార్టీల నాయకులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

ధన్వాడ: నారాయణపేటలో జరిగిన బీఆర్ఎస్ సభను విజయవంతం చేయడం పట్ల యువజన సంఘం అధ్యక్షులు సునీల్ రెడ్డి మండల ప్రజలకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేటీఆర్ సభకు మండలం నుంచి పెద్ద ఎత్తున్న ప్రజలు తరలివచ్చారని, వచ్చే ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని అన్నారు. నారాయణపేట జిల్లాలో ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని ప్రజలు స్వాగతిస్తున్నారని అన్నారు. ఇందులో సింగిల్ విండో వైస్‌చైర్మన్ గండిబాల్‌రాజ్, నాయకులు రాజేందర్ రెడ్డి, కృష్ణయ్య, అంజనేయులు, రాజేష్, బాలయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

నేటి నుంచి 'హాత్ సే హాత్ జోడో'



మాట్లాడుతున్న కోట్ల రవీందర్‌రెడ్డి

నారాయణపేట: భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా గురువారం నుంచి నారాయణపేట జిల్లాలో హాత్ సే హాత్ జోడో పాదయాత్రను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కోట్ల రవీందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు లిఖిరఘుబాబు, కౌన్సిలర్ మహ్మద్ సలీంలు పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షులు వాకిటి శ్రీహరి, పేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డిలు పార్టీ జెండాను ఆవిష్కరించి లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. ఫిబ్రవరి 6 నుంచి రెండు నెలల పాటు పూర్తిస్థాయిలో జిల్లాలోని బ్లాక్, మండల, బూత్ స్థాయిలో యాత్ర ఉంటుందన్నారు. పార్టీ నాయకలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాజప్ప

కోస్గి: వీఆర్ఏల సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇచ్చి ప్రభుత్వం మరిచిపోయిందని మండల వీఆర్ఏల సంఘం ప్రతినిధులు అన్నారు. పరిష్కారం కోసం మరోమారు సమ్మెకు దిగుతామన్నారు. సంఘం ప్రతినిధులు సత్యప్ప, శ్రీనివాస్, హన్మంతు, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని జేఏసీ చైర్మన్ రాజప్ప డిమాండ్ చేశారు. బుధవారం ఊట్కూరులో విలేకరుల సమావేశంలో సమస్యల పరిష్కారానికై చేపట్టిన సమ్మెను మంత్రి కేటీఆర్ హామీ మేరకు విరమించి 100 రోజులు అవుతున్నా ప్రభుత్వం ఇంతవరకు స్పందించడం లేదని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించకపోతే మళ్లీ సమ్మెబాట పడతామన్నారు. మండల చైర్మన్ శ్రీనివాస్, జిల్లా నాయకులు భీంరావు, వెంకటప్ప, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్‌ల అందజేత



కుట్టుమిషన్‌లను అందజేస్తున్న పోలీసులు

నారాయణపేట: ఓఎంఐఎఫ్ ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన జోగిని కుటుంబాల ఆడపిల్లలకు సీఐ రవిబాబు, ఎస్ఐ సురేశ్‌ల చేతుల మీదుగా కుట్టుమిషన్లు సర్టిఫికెట్లు, నిత్యవసర సరుకులను అందజేశారు. సీఐ మాట్లాడుతూ ఓఎంఐఎఫ్ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, జోగిని వ్యవస్థ నిర్మూళన పై ప్రజల్లో అవగాహన పెంచుతూ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ చైతన్యం తీసుకురావడం అభినందనీయమన్నారు. ఎల్లవేళలా తమ సహకారం ఉంటుందని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరికైనా సమస్యలు ఉంటే 100, 1098కి ఫోన్ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఆ సంస్థ స్టేట్ ప్రతినిధులు ఏంజెలా డేవిస్, ఎండి జోష్, సాధన బింధు, జిల్లా సమన్వయ కార్యకర్తలు హజమ్మ, నర్సింహులు, ఈశ్వరమ్మ, క్రిష్ణ, హన్మంతు, నారాయణ, అశమ్మ, అనిల్, శ్రావణి, శాంతప్ప, ఈశ్వరప్ప, మంజుల, అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.